సాక్షి రంగారెడ్డి

7

ఆదివారం । 30 । మార్చి । 2025



పల్లెల అభివృద్ధితోనే ప్రగతి

పల్లెల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.


8లో▸



ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్

ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు వేళ చేపట్టే సహాయక చర్యలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్‌డ్రిల్ నిర్వహించింది.

8లో▸



న్యూస్‌రీల్

ఇందిరమ్మ ఇళ్లలో నాణ్యత పాటించాలి



శిక్షణ పొందిన మేస్త్రీలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మించేందుకు గాను నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన 40 మంది నైపుణ్యం కలిగిన మేస్త్రీలకు శిక్షణ ఇచ్చారు. వీరికి శనివారం కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. తొలివిడత ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ మేస్త్రీలు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, శిక్షణలో రోజుకు రూ.300 చెల్లించి, డ్రెస్సులు, హెల్మెట్లు కూడా ప్రతీ మేస్త్రీకి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో శిక్షణ పొందిన మేస్త్రీలు ప్రతి గ్రామంలో నాలుగు నుంచి పది ఇళ్ల వరకు నిర్మిస్తున్నారని తెలిపారు. రాబోయే కాలంలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. త్వరలో ఇంకా కొంత మందికి శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ డీసీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

షాద్‌నగర్: మహిళలు స్వయం ఉపాధితో ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ శంకర్ అన్నారు. ప్రగతి వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు నెలలుగా మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన మహిళలకు శనివారం సొసైటీ ప్రతినిధులు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధితో జీవించాలనే ఆలోచనతో నిష్ణాతులచే కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ చదువుతో పాటు నైపుణ్యం ఎంతో అవసరమన్నారు. మహిళల అభివృద్ధికోసం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న ప్రగతివెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ అగర్వాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. విద్య, వైద్యం, మహిళా సాధికారతకోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు తులసి, ప్రగతి, కార్తీక్, శ్రీకాంత్, లావణ్య, శ్వేత, శృతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పగడాల యాదయ్య మాట్లాడుతూ.. రామోజీ ఫిలింసిటీలో ఇంటి స్థలాల కోసం పోరాటం చేశామని, ఆ జాగాలు లబ్ధిదారులకు ఇచ్చేలా చూడాలని అన్నారు. 18 సంవత్సరాలుగా పోరాటం చేసి శాంతియుతంగా జాగాల్లోకి వెళ్తే పోలీసులు అరెస్టులు చేయడం దారుణమన్నారు. దీనిపై తక్షణమే నిర్ణయం తీసుకోకపోతే గుడిసెలు వేసి ఆక్రమిస్తామని హెచ్చరించారు. అలాగే అనాజ్‌పూర్ గ్రామంలోని సర్వే నంబర్ 125లో రైతులకు పట్టా పాస్‌బుక్కులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సామేలు, జిల్లా నాయకులు బుగ్గ రాములు, జంగయ్య, జగన్, నర్సింహ, ఆనంద్, భిక్షపతి, స్వామి, పాండు తదితరులు పాల్గొన్నారు.

విశ్వావసు.. కొత్త ఉషస్సు



ఉగాది అంటేనే షడ్రుచుల మేళవింపు.. తెలుగువారి పర్వదినం.. ఈ రోజు ఏ పని తలపెట్టినా అంతా శుభమే కలుగుతుందని జనం విశ్వాసం.. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం.. పంచాగ శ్రవణం చేయడం ఆనవాయితీగా వస్తోంది.. దశాబ్దాల కాలంగా కొంతమంది వేద పండితులు పంచాంగ పఠనం చేస్తూ తమదైన ముద్ర వేస్తున్నారు.. ఇప్పటికీ తెలుగు సంప్రదాయాన్ని పాటిస్తూ పలువురు పంచెకట్టులో జీవనం సాగిస్తున్నారు.. క్రోధినామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ విశ్వావసు నామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికే సమయాన 'సాక్షి' ప్రత్యేక కథనం..

వారసత్వానికి 'వంద'నం



నటరాజ్‌శర్మ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని పురాతన నడిగడ్డ ఈశ్వ రాంజనేయస్వామి దేవాలయంలో ఒకే కుటుంబ వారసులు వందేళ్లకు పైబడి ఉగాది పర్వదినాన పంచాంగ పఠనం చేస్తున్నారు. ఈ దేవాలయానికి అన్నదమ్ములైన నరసింహశర్మ, గోపాలశర్మ పూజారులు. ఉగాది రోజు పంచాగ పఠనం చేయడం ఆ కుటుంబానికి వారసత్వంగా వస్తోంది. వారి తదనంతరం అన్నదమ్ములైన సీతారామశర్మ, కృష్ణమూర్తిశర్మ పఠనం చేశారు. ఆ కుటుంబ వారసుడైన నటరాజ్‌శర్మ 20 ఏళ్లుగా వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు.

ఏం చెప్పారంటే..

శ్రీ విశ్వవసు నామ సంవత్సరంలో జిల్లాకు, ఇబ్రహీంపట్నానికి రాశుల స్థాన చలనంతో గోచార ఫలాలు సాధారణం. ప్రథమంలో ఒడిదొడుకులున్నా.. సంవత్సరాంతంలో (డిసెంబర్ నుంచి) పరిస్థితులు మెరుగుపడతాయి. అన్నివిధాలా అభివృద్ధి దిశగా ముందుకెళ్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో కొన్ని సమస్యలు ఎదురవుతాయి. ప్రపంచ దేశాల్లో భారతదేశం పేరు ప్రఖ్యాతులు గడిస్తుంది. యుద్ధ భయం ఉంటుంది. ప్రపంచ శాంతికి, లోక కల్యాణం కోసం ప్రజలు యజ్ఞాయాగాది క్రతువులు నిర్వహిస్తారు.

దివ్యమైన అనుభూతి


చిలుకూరు ఆలయ అర్చకుడు రంగరాజన్



మొయినాబాద్: ఉగాది రోజున అర్చకులు, పూజారులు, పండితులు పంచాంగ పఠనం చేస్తారు. ఆ ఏడాది భవిష్యత్తు ఎలా ఉండబోతోంది.. ఆదాయ, వ్యయాలు ఎలా ఉంటాయి.. అతివృష్టి, అనావృష్టి వంటి విషయాలను పంచాంగ పఠనం ద్వారా ప్రజలకు తెలియజేస్తారు. అలా పంచాంగ శ్రవణం చేయడం ఓ దివ్యమైన అనుభూతిగా భావిస్తూ బాలాజీ సన్నిధిలో 22 ఏళ్లుగా పంచాంగ పఠనం చేస్తున్న చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అనుభూతులు, అనుభవాలు ఆయన మాటల్లోనే.. 2002లో మొదటిసారి మా తాతగారు పక్కన కూర్చోబెట్టుకుని నాతో పంచాంగ పఠనం చేయించారు. ఆ తరువాతి సంవత్సరం నుంచి 22 ఏళ్లుగా ప్రతి సంవత్సరం బాలాజీ స్వామివారి సన్నిధిలో పంచాంగ పఠనం చేస్తున్నాను. ఇందులో మంచి విషయాలనే చెబుతాను. ప్రజలను భయపెట్టే విషయాలను నేరుగా చెప్పను. అలాంటి పరిస్థితులు వస్తే స్వామివారి అనుగ్రహంతో అదికూడా మంచే జరగాలని ప్రార్థిస్తాను. ఉగాది రోజు సాయంత్రం 5 గంటలకు స్వామి వారికి పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ముందే కూర్చుని పంచాంగ పఠనం చేస్తాను. పదేళ్ల క్రితం వర్షాలు సరిగా పడవని చెప్పాల్సి వచ్చింది. ఆ ఏడాది చిలుకూరు బాలాజీ చెంతన ఉన్న గండిపేట చెరువు పూర్తిగా ఎండిపోయింది. ఎండిన చెరువు మధ్యలో కూర్చుని వరుణయాగం చేశాను. తరువాత సంవత్సరం నుంచి వర్షాలు బాగా కురిశాయి. ఇప్పటి వరకు చెరువు ఎండలేదు. వ్యక్తుల గురించి, ప్రాంతాల గురించి మాత్రం పంచాంగ పఠనం చేయను. అందరి గురించి మాత్రమే వినిపిస్తాను. విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు స్వామివారి ముందు చదివి వినిపిస్తాను.

ప్రహ్లాదాచారి.. పంచాంగంలో ఆరితేరి

50 ఏళ్లుగా పంచాంగ పఠనం



షాద్‌నగర్: విశ్వంలోని జీవకోటి రాశుల ఆయుష్షుకు తొలి రోజు ఉగాది అని, ఉగాది నుంచే వసంత రుతువు ప్రారంభం అవుతుందని షాద్‌నగర్ పరిధిలోని ఉత్తర రామేశ్వరం దేవాలయ ధర్మకర్త, జ్యోతిష్యుడు ప్రహ్లాదాచారి అన్నారు. ఉగాది వేళ ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. తెలుగు నామ సంవత్సరం ఉగాది విశ్వావసు నామ సంవత్సరం. విశ్వావసు అంటే విశ్వాసానికి సంబంధించింది. విశ్వావసు నామ సంవత్సరంలో శని సంచారంలో మార్పుతో కొన్ని రాశుల వారికి అఖండ రాజయోగం కలుగుతుంది. విశ్వావసు నామ సంవత్సరం ఉగాది తర్వాత ద్వాదశ రాశుల్లో మూడు రాశులకి శని సంచారంలో మార్పుతో రాజయోగం కలుగుతుంది. వృషభ రాశి, మకర రాశి, తులా రాశి వారికి అంతా మంచి జరుగుతుంది. కొత్త ఏడాదిలో అనేక మందికి శుభ ఫలితాలు రానున్నాయి.

రాశీ ఫలాలపై ఆసక్తి

50 ఏళ్లకు పైగా పంచాంగ పఠనం చేస్తున్నాను. కొత్త తెలుగు ఉగాది రోజున తమ రాశి ఫలాలు ఏవిధంగా ఉన్నాయి.. భవిష్యత్ ఏవిధంగా ఉండబోతోంది.. తెలుసుకునే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఆదాయం, వ్యయం, అవమానం, రాజపూజ్యం ఏవిధంగా ఉంటుందని చాలా మంది ఆసక్తిగా తెలుసుకుంటున్నారు.

70 ఏళ్లుగా పంచాంగ పఠనం



కుర్మిద్దలో గతేడాది పంచాంగ పఠనం చేస్తున్న రాజేశ్వరశర్మ

యాచారం: 'పంచాంగం అంటే భవిష్యత్తును తెలియజేసేది.. ఏడాది కాలం పాటు మంచి, చెడు, లాభనష్టాలు, వర్షాల ప్రభావం, వ్యక్తుల జాతకాలు, సూర్యచంద్రుల ప్రభావం గురించి తెలియజేసేదే పంచాంగ పఠనం..' అని అంటున్నారు మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన మురుకుంట్ల రాజేశ్వరశర్మ. తన వయసు ఇప్పుడు 86 ఏళ్లని 70 ఏళ్లుగా పంచాంగ పఠనం చేస్తున్నట్టు తెలిపారు. ఏటా ఉగాది పండుగ రోజు గ్రామంలోని సత్యనారాయణస్వామి దేవాలయంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం 4 గంటల సమయంలో కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకని గ్రామస్తుల సమక్షంలో పంచాంగ పఠనం చేస్తానని చెప్పారు. ఉగాది పండుగ జరుపుకొని షడ్రుచుల పచ్చడి సేవించిన తర్వాత దేవాలయం వద్దకు వచ్చి పంచాంగాన్ని శ్రద్ధగా వింటారని పేర్కొన్నారు. వ్యక్తుల పేర్ల వారీగా, పిల్లల భవిష్యత్తు, ఉద్యోగాలు, పెళ్లిళ్లు, వర్షాల ప్రభావం, ఏ పంటలకు అధిక డిమాండ్ ఉంటుంది, రాజకీయ విషయాలు, తిథి, నక్షత్రాలు, గ్రహాలు, రాశులు, శని దేవుని ప్రభావం వంటి విషయాలను ఆసక్తిగా తెలుసుకుంటారని వివరించారు. తెలుగు సంప్రదాయం ప్రకారం ఉగాది రోజు నుంచి కొత్త సంవత్సరం ప్రారంభమవుతుందని, అన్ని శుభకార్యాలకు ఉగాదే శుభారంభం అవుతుందని వివరించారు.

చీరకట్టు.. సంప్రదాయం ఉట్టిపడేట్టు



రాజేశ్వరి, ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం: తెలుగువారి ఆచార, సంప్రదాయాలకు ఆడపిల్ల చీరకట్టు నిండుతనాన్ని ఇస్తుంది. చీర కట్టుతో లక్ష్మీ కళ ఉట్టిపడుతుంది. ఆడపిల్లగా, ఇల్లాలిగా, తల్లిగా, అక్కగా, చెల్లిగా ఆడతనంలోని నిండుతనాన్ని, గౌరవాన్ని చీర కట్టు చాటిచెబుతుంది. ఇతర దుస్తులు ఎన్ని ధరించినప్పటికీ పెళ్లిళ్లు, పేరంటాలు, బంధువుల ఫంక్షన్లకు చీర ధరించే వెళ్తాను అంటోంది ఇబ్రహీంపట్నానికి చెందిన రాజేశ్వరి. చీరలోనే అందం తొణికిసలాడుతుందని చెబుతోంది. తన తోటి స్నేహితులకు సైతం చీరలు కట్టుకోవాలని సూచిస్తుంటానని పేర్కొంది.

రామాచారి ఇలా చెప్పారు..



మీర్‌పేట: జిల్లెలగూడలోని పురాతన శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుడిగా ఉన్న డింగరి రామాచారి 25 ఏళ్లుగా ఏటా ఉగాది రోజు పంచాంగ పఠనం చేస్తున్నారు. కొత్త ఏడాదిపై వారి మాటల్లో...

- గురు, రాహు, కేతువులు, జన్మ, ద్వాదశ, అష్టమ, అర్ధాష్టమ, ఏలినాటి శని దోషాలు పోవడానికి ప్రజలకు నివారణలు చెప్పడం జరుగుతుంది. ఆకస్మికంగా వచ్చే ప్రమాదాలు, అనుకోని సంఘటనలు జరిగే పరిస్థితుల నుంచి తప్పిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పంచాంగం చెప్పడం చాలా విశేషం. స్థానాలు సరిగ్గా లేనప్పుడు ఆయా పరిస్థితులు ఏర్పడతాయని, దాంట్లో ఉండే గ్రహస్థితులు, రాశుల ఫలితాలు చెప్పడం ద్వారా దోషాలు తొలగిపోయి శుభాలు జరిగిన పరిణామాలు చాలా ఉన్నాయి.
- విశ్వావసు నామ సంవత్సరంలో శష్ఠగ్రహకుటమితోనే ఉగాది ప్రారంభమైంది. జిల్లాలో ద్వాదశ రాశుల్లో ఆరు రాశుల వారికి కొంచెం ఇబ్బందులు కలిగే సమస్య ఉంది. ముఖ్యంగా సినిమా, రాజకీయ, ప్రభుత్వ అధికారులకు కొంత గడ్డు పరిస్థితి ఉంటుంది. ఆర్థికంగా ఈ సంవత్సరం ఇబ్బందులు ఉంటాయి. ఎవరికైనా రుణం ఇస్తే తిరిగి రాకపోవడం ఉంటుంది. తెలియని వారికి ఇచ్చి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలి.
- ఆయా రాశుల వారు దాని పరిహారాల కోసం ఇష్టదైవాన్ని పూజించడం, గ్రామదేవతలను పూజించడంతో పాటు శని గ్రహాన్ని పూజించి ఆరాధించి దానాలు చేయడం ద్వారా ఈ సంవత్సరం కొన్ని దోషాలు వారి వారి గ్రహస్థితులను బట్టి తొలగిపోతాయి.

పంచాంగ పఠనంలో హాఫ్ సెంచరీ



ప్రకాష్ శర్మ

ఇబ్రహీంపట్నం రూరల్: ఏడు పదుల వయసులో కొంగరకలాన్‌కు చెందిన ప్రకాష్ శర్మ ఏటా పంచాంగ పఠనం చేస్తున్నారు. 12 ఏళ్ల ప్రాయం నుంచే వేదాలు వల్లెవేసిన ఆయన 50 ఏళ్లుగా ఉగాది పంచాంగం చెబుతున్నారు. విశ్వావసు నామ ఉగాది ఎలా ఉండబోతోందో వివరించారు. ఆయన మాటల్లోనే.. సూర్యుడు రాజు అయ్యాడు.. చంద్రుడు మంత్రి అయ్యాడు. పంటలు పుష్కలంగా పండినప్పటికీ, సమస్యలూ ఉంటాయి. ఆరోగ్యాలు బాగుంటాయి. ఎండలు విపరీతంగా ఉంటాయి. ఎర్రటి ధాన్యం ఎక్కువగా పండుతుంది. బంగారం ధరలు, వజ్రాల ధరలు పెరుగుతాయి. ఇనుము ధరలు కూడా పెరుగుతాయి. పంచాంగం ప్రకారమే మనుషుల జీవితాలు ఉంటాయి.

ఉగాది.. వ్యవసాయానికి నాంది

యాచారం: ఉగాది పండుగను జరుపుకొని, దేవాలయాల వద్ద పంచాంగ పఠనం విని వ్యవసాయ పొలాల్లో పనులు ప్రారంభిస్తే ఎంతో కలిసొస్తుందని రైతుల్లో విశ్వాసం. ఉగాది పండుగ రోజు వ్యవసాయ పనులు ప్రారంభిస్తే వేసవి రోజుల్లో దుక్కులు దున్ని, పొలాన్ని చదును చేసుకుంటే, వర్షాలు కురిసిన వెంటనే వానాకాలం కింద పంటలు సాగు చేసుకోవచ్చనే నమ్మకం. అందుకే ఉగాది రోజు దేవతామూర్తులకు పూజలు నిర్వహించి ఊరేగింపుగా అరకదున్నే ఎద్దులతో పొలాలకు వెళ్లి పనిముట్లు, పశువులకు పూజలు నిర్వహించి వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు.


పంచెకట్టు.. తెలుగుదనం అదిరేట్టు



కోదండరెడ్డి

యాచారం: పంచెకట్టు అంటే ఆయనకు ప్రాణం.. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పంచెకట్టుతోనే రోజును ప్రారంభిస్తారు. 70 ఏళ్లకు పైగా పంచకట్టుతోనే అధికార, ప్రతిపక్ష పాత్ర పోషించినట్లు చెబుతున్నారు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 'సాక్షి' పలకరించగా పలు విషయాలు పంచుకున్నారు. ఆయన మాటల్లోనే.. రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు రైతులాగా ఉండాలన్నదే ఇష్టం. 50 ఏళ్లుగా ప్రజా జీవితంలో ఉంటూ రెండు సార్లు ముషీరాబాద్ ఎమ్మెల్యేగా, హుడా చైర్మన్‌గా, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. పంచెకట్టుతోనే రోజును ప్రారంభిస్తాను. విదేశాలకు వెళ్లినా పంచెకట్టుతోనే వెళ్తాను.

ఏఏ రంగాలు బాగుంటాయంటే..



అనిల్‌కుమార్‌జోషి

కందుకూరు: విద్య, వాణిజ్యం, సినీ రంగాల్లో తెలుగు రాష్ట్రాలు దేశంలోనే ముందుంటాయని పులిమామిడిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రం నిర్వాహకుడు బ్రహ్మశ్రీ గురూజీ అనిల్ కుమార్‌జోషి తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరం ఎలా ఉండబోతోంది.. ఏఏ రంగాలు బాగుంటాయి.. ఎవరికి లాభం.. ఎవరికి నష్టం అనే అంశాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే.. మే 29న వచ్చిన షష్ఠగ్రహ కూటమి ప్రభావం రెండు రోజులు పాటు ఉంటుంది. ఉగాది తర్వాత పంచగ్రహ కూటమితో చంద్రుడు నిస్తేజితుడు అవుతాడు. దీని కారణంతో మే 31 వరకు తుపాన్లు, వడగళ్ల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలతో పాటు జ్వరాలు, ఇతర అనారోగ్యాలు ప్రజలను పట్టి పీడించే అవకాశం ఉంది. ఆరుద్ర నక్షత్రం ప్రభావంతో ఈ సంవత్సరం వర్షాలు సాధారణంగా ఉంటాయి. పంటలకు ఎలాంటి ఇబ్బందులు రావు.

'ఉగాది సంస్కృతి- ఉజ్వల ప్రగతి'



విశ్వశ్రేయస్సును కోరి వేంచేసిన ఓ విశ్వావసూ.. నీకు మా విశేష సారస్వత స్వాగతం! ఉత్తమమైన ఉత్తరాయణం ఒక రామయణంలా.. దక్షితగల దక్షిణాయనం ఒక కృష్ణాయనంలా.. రెండు అయనాల నీ రెండు నయనాలతో, నీరెండు పవనాలవంటి కమనీయ కవనాలుగా, నీవు వీక్షించు కలల కళకళల కళాఝురులు... నీలో దీప్తించు కవుల ఉగాది సంస్కృతి సిరులు !

- సృష్ట్యాదిన దినకరుని తొలి కిరణావరణంలో, సృష్టికర్త కవియై రచించిన యుగారంభ సంరంభంలో, చిత్రరథుని మధుర గంధర్వ గాన గమకమై, చైత్ర వసంతుని నాట్యపదసుందర గమనమై, అల.. ఆమని అలరుల అలరింతలతో, పూవని పూతల పులకింతలతో, తరులతల కొత్త ఇగురుల చిగురింతలతో, కోయిల సరాగ స్వనాల వీనుల విందులతో, వత్సరాదిన అరుదెంచు ఓ కొత్త ఉగాది.. మత్సరాలను మాన్పించే సరికొత్త ఉపాధిగా, నూతనత్వంలో మానవత్వమై, సమానత్వమై, చేతనత్వంలో నీతితత్వమై, నిత్య సత్యమై ప్రగతిగా ప్రతి ముంగిట ప్రకాశించగదే! ప్రదీపించగదే!!

– కదుకుంట్ల వీణారెడ్డి, రచయిత్రి, నందిహిల్స్, మీర్‌పేట

ఉగాది పచ్చడి



"తీపి చేదు పులుపు తినవలె వగరును
ఉప్పు కార ముదకములతో గలిపి
కష్ట సుఖములన్ని కలిసుండె జీవితం
అనుభవంబు కొచ్చి హాయి గొలుపు..!!

– కె.హనుమంతరెడ్డి, పద్యకవి, మీర్‌పేట, నందిహిల్స్

రేకులు విచ్చినట్లు



రేకులు విచ్చినట్లు సవరించిన వీణియ పల్కినట్లులో
లాకులు యమ్మలే చెవులనల్లన గాలికి ఊగినట్లుపుం
స్కోకిల కూసినట్లు తళుకుల్ ప్రకృతిన్ విరబూసినట్లును
శ్రీకరమైన 'విశ్వవసు' హసించుచు వచ్చె
తెలుంగు నేలకున్

– కె.శ్రీధర్‌శర్మ, జెడ్పీహెచ్‌ఎస్, నల్లవెల్లి

మంచీ చెడుల దిక్సూచి



ఉగాది పండుగ రోజున పంచాంగ పఠనం తరతరాల సంప్రదాయం. పంచాంగం మంచీచెడులకు దిక్సూచి లాంటిది. ఆయా రాశుల వారికి సంత్సరమంతా ఎలా ఉండబోతోందో పంచాంగం వివరిస్తుంది. శుభాలనేవి గ్రహాల సంచారం బట్టి ఉంటుంది. కొందరికి సంవత్సరమంతా లాభదాయకంగా, మరికొందరికి మిశ్రమంగా, ఇంకొందరికి ఇబ్బందికరంగా ఉండొచ్చు. ఇది ఆయా వ్యక్తుల నమ్మకం మీద ఉంటుంది.

– శ్రీను పంతులు, షాబాద్

భక్ష్యాలు ప్రత్యేకం



ఉగాది పండుగ అంటేనే అందరికీ గుర్తొచ్చేది భక్ష్యాలు (పోలెలు). ఉగాది పచ్చడి ఎంతటి ప్రాధాన్యం ఉందో భక్ష్యాలకూ అంతే ప్రాధాన్యం. మిగతా పిండి వంటలు ఎన్ని వండినా భక్ష్యాలు మాత్రం ప్రత్యేకం. సాధారణంగా పండుగకు ఒకరోజు ముందే సిద్ధం చేస్తారు. ముందుగా శనగపప్పు, పంచదారను గ్రైండర్‌లో రుబ్బి పూర్ణంగా మారుస్తారు. అనంతరం గోధుమపిండిని తడిపి చిన్న చిన్న ముద్దలుగా తయారు చేస్తారు. వీటిని పూరీల్లా బత్తుకుంటూ పంచదార పూర్ణన్ని జోడిస్తారు. పెనంపై ఉంచి కొద్దికొద్దిగా నెయ్యివేస్తూ అటూఇటూ తిప్పుతూ కాలిస్తే తియ్యని నోరూరించే భక్ష్యాలు సిద్ధం.

– శోభా, గృహిణి, చందనవెళ్లి

ఆప్యాయతల కలబోత



ఉగాది పండుగను ఊళ్లో ఆనందంగా జరుపుకొంటాం. మా చిన్నతనంలో పండుగకు ఒక ఏడాది అమ్మమ్మ మరో ఏడాది నాన్నమ్మ ఇంటికి వెళ్లేవాళ్లం. బంధువులు, సన్నిహితులతో ఎంతో ఆనందంగా గడిపే వాళ్లం. చుట్టుపక్కల వారందరూ ఎంతో ప్రేమ, ఆప్యాయతలతో పలకరిస్తారు. మా ఇంట్లో చేసిన ఉగాది పచ్చడి, పులిహోరా, పిండి వంటకాలను అందరికీ ఇస్తుంటాను.

– గిరిజ, గృహిణి, మన్‌మర్రి, షాబాద్ మండలం

ఆమనగల్లులో బీసీ కమిషన్ పర్యటన

కులాల పేర్ల మార్పుపై అభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న బీసీకమిషన్ చైర్మన్ నిరంజన్

ఆమనగల్లు: బీసీ జాబితాలో ఉన్న పలు కులాల పేర్లను మార్చాలంటూ వచ్చిన వినతులపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటించి ఆయా కులాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని వివరించారు. తమ కులం పేరు మార్చాలంటూ వీరముష్టి కులస్తులు ఇచ్చిన వినతులు మేరకు కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మితో కలిసి శనివారం ఆయన ఆమనగల్లులో పర్యటించారు. శ్రీనివాస కాలనీలో నివాసం ఉండే వీరముష్టి కులస్తుల ఇళ్లను పరిశీలించారు. వారి జీవన స్థితిగతులపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ కులం పేరును వీరభద్రియగా మార్చాలని కోరారు. అనంతరం నిరంజన్ మాట్లాడుతూ.. వీరముష్టి, పిచ్చకుంట్ల, దొమ్మర, తమ్మిలి తదితర కులాల పేర్లను మార్చాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా వస్తున్న వినతులపై అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో కందుకురు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారి మాధవరెడ్డి, తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, సీఐ ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చందర్ తెలిపిన ప్రకారం... ఇబ్రహీంపట్నంలో నివాసముండే ఎండీ చాంద్‌పాష(43)కు జేసీబీలున్నాయి. కొంత కాలంగా ఆయన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన పాష రాత్రి 11 గంటల ప్రాంతంలో స్థానిక వైఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని చింతచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోచమ్మ తల్లి ఆలయంలో చోరీ

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని పాటిగూడ పోచమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీ ధ్వంసం చేశారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ తాళం పగులగొట్టి రూ.24వేల ఎత్తుకెళ్లారని చెప్పారు. ఈ మేరకు శనివారం ఆలయకమిటీ సభ్యులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మట్టిని తరలిస్తున్న వాహనాలు సీజ్

మాడ్గుల: నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సీఐ వేణుగోపాల్ రావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఇర్విన్ శివారులో వాగు నుంచి శనివారం ఉదయం మట్టి తవ్వి తరలిస్తుండగా పెట్రోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది గమనించారు. వాహనాలను ఆపి పత్రాలు పరిశీలించడంతో ఎటువంటి అనుమతులు లేవని గుర్తించారు. దీంతో నాలుగు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేశారు. డ్రైవర్లు, వాహన యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

షడ్రుచుల పచ్చడి



సాక్షి,రంగారెడ్డిజిల్లా: హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరాల సరసన నిలుపడంలో రంగారెడ్డి జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. నగర అభివృద్ధి, విస్తరణ, పెట్టుబడులు, ఇలా అన్ని అంశాలు జిల్లాతోనే ముడిపడి ఉన్నాయి. ‘విశ్వావసు’నామ సంవత్సరంలో శని సంచారంలో మార్పు వల్ల కొన్ని రాశుల వారికి అఖండ రాజయోగాన్ని కల్పించనుండగా.. మరికొన్ని రాశులవారికి మిశ్రమ ఫలితాలను అందించబోతోంది. ఆదివారం తొలి తెలుగు నామ సంవత్సరం.. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పంచాంగం.

తీపి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్‌సిటీ/ఫోర్త్‌సిటీ జిల్లా వాసులకు ఈ సంవత్సరం మరింత తీపిని పంచబోతోంది. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు మించి 30 వేల ఎకరాల్లో మరో మహా నగరం ఆవిష్కృతం కాబోతోంది. 200 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ(ఏఐ)రాబోతోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్టేడియాలు, కోచింగ్ కేంద్రాలతో ఈ ప్రాంతం ఓ స్పోర్ట్స్ హబ్‌గా మారబోతోంది. 12 క్రీడల అకాడమీలు జిల్లా క్రీడాకారులకు ఇక్కడ అందుబాటులోకి రాబోతున్నాయి. మీర్‌ఖాన్ పేట కేంద్రంగా వెలసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఈ కొత్త సంవత్సరంలో సుమారు 20 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించబోతోంది.

చేదు

కొత్త ప్రాజెక్టులు, పెట్టుబడులు నిరుద్యోగ యువతకు తీపిని పంచుతుంటే.. కొత్త ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న బలవంతపు భూసేకరణ మెజార్టీ రైతుల జీవితాల్లో చేదును మిగుల్చుతోంది. బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.రెండు నుంచి రూ.ఐదు కోట్ల ధర పలికే భూములకు ప్రభుత్వం రూ.15 నుంచి రూ.25 లక్షలకు మించి నష్టపరిహారం చెల్లించడం లేదు. ప్రభుత్వ చర్యలను రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. కొత్త ప్రాజెక్టుల రాక..నగర విస్తరణతో వ్యవసాయం పూర్తిగా తగ్గిపోయింది. గతంలో పూలు, పండ్లు, కాయగూరల తోటలకు నెలవైన భూములు.. ప్రస్తుతం పూర్తిగా లే అవుట్లుగా, గేటెడ్ కమ్యూనిటీలుగా మారిపోవడం కూడా రైతుకు ఓ చేదు జ్ఞాపకంగా మిగిలిపోనుంది.

కారం

దేశంలోనే రంగారెడ్డిజిల్లా ఓ మినీ ఇండియాగా మారింది. అన్ని ప్రాంతాలు, మతాల వారు ఇక్కడ ఉంటున్నారు. వీరితో పాటే కరడుగట్టిన నేరస్తులు సైతం ఇక్కడే అడ్డా వేస్తున్నారు. పెద్దపెద్ద నేరాల్లోనూ స్థానికుల కంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి ప్రమేయమే ఎక్కువ. ఈ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలపై కూడా వారికి కనీస అవగాహన ఉండడం లేదు. ఫలితంగా క్రైం రేటు భారీగా పెరుగుతుండటానికి కారణమవుతున్నారు. తరచూ ఏదో ఒక చోట హత్య, ఆత్మహత్య, దొంగతనం, దోపిడీ వెలుగు చూస్తూనే ఉన్నాయి.

పులుపు

ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల్లో పాలుపంచుకునే అవకాశం జిల్లాకు దక్కలేదు. అభివృద్ధి, ప్రాజెక్టుల విస్తరణ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా నుంచి ఒక్క మంత్రి కూడా లేకపోవడాన్ని జిల్లా ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. కారు గుర్తుపై గెలిచిన శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఆ తర్వాత హస్తం గూటికి చేరుకున్నారు. ఇప్పటికే వీరి మెడపై కోర్టు కేసు కత్తిలా వేలాడుతోంది. త్వరలో చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో వీరికి చోటు లభించే అవకాశం లేదు. ఇక కల్వకుర్తి, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు హస్తం గుర్తుపై తొలిసారిగా గెలిచినా.. అనుభవ లేమి వారిని ఇందుకు దూరం చేస్తోంది. ఇక మొదటి నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేకు వచ్చే మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కుతుందో లేదో వేచి చూడాల్సిందే.

వగరు

ఆర్థిక మాంద్యానికి తోడు వరుస ఎన్నికలు, హైడ్రా దూకుడు, మూసీలో కూల్చివేతలు సహా ప్రభుత్వం అనాలోచిత చర్యలు రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా ఈ రంగం ఇప్పటికే స్తబ్దుగా మారింది. క్రయ, విక్రయాలు లేక ఇప్పటికే అనేక మంది ఏజెంట్లు, చిన్న చిన్న నిర్మాణ దారులు ఆర్థికంగా నష్టపోయి కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి తలెత్తింది. అప్పులు చేసి భూములపై పెట్టుబడి పెట్టిన చిరు వ్యాపారులు మింగ లేక, కక్కలేని దుస్థితి. రిజిస్ట్రేషన్ల ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం రాక ప్రభుత్వం సైతం నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ‘విశ్వావసు’నామ సంవత్సరంలోనైనా ఈ రంగంలో మార్పులు చోటు చేసుకుంటాయో వేచి చూడాల్సిందే.

ఉప్పు

పాలు, పండ్లు, కూరగాయలు, పండ్లు, నూనెలు, పప్పు వంటి నిత్యవసర ధరలు ఆకాశాన్నంటాయి. పెరిగిన ధరలు..తరిగిన సంపాధనతో సగటు జీవి విలవిల్లాడుతున్నాడు. కేవలం నిత్యవసరాలే కాదు భూముల ధరలు ఆకా శాన్నంటాయి. వంద గజాల ఖాళీ జాగా కొనలేని పరిస్థితి. ఇళ్లు కట్టలేని దుస్థితి. దేశంలో అత్యధిక వేగంగా వృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో రంగారెడ్డి జిల్లా ముందు వరుసలో ఉన్నప్పటికీ రోజురోజుకు పెరుగుతున్న అంత రాలు ప్రజలకు మింగుడుపడని వ్యవహారంగా మారింది.

చెరువులో మునిగి వ్యక్తి మృతి


ముట్టిపురి రాజు(ఫైల్)

దుద్యాల్: బతుకుదెరువు కోసం చెల్లీబావ వద్దకు వచ్చాడు. దొరికిన రోజు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించాడు. అనుకోకుండా చేపల వేటకు వెళ్లి, చెరువులో మునిగి మరణించాడు. ఈ ఘటన మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. కోస్గి ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొయినాబాద్ మండలం చిన్న మంగళారం గ్రామానికి చెందిన ముట్టిపురి రాజు(32) నెల రోజుల క్రితం పోలేపల్లిలో ఉండే తన చెల్లి దొబ్బలి స్వప్న ఇంటికి వచ్చాడు. ఇక్కడే ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. శనివారం పని దొరకకపోవడంతో చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి చనిపోయాడు. అక్కడే క్రికెట్ ఆడుతున్న యువకులు ఇది గమనించి చెరువులో గాలించి బయటకు తీయగా అప్పటికే మరణించాడు. ఘటన స్థలానికి చేరుకున్న కోస్గి పోలీసులు వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


మేకల మధు(ఫైల్)

మొయినాబాద్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా మానసిక వేదనకు గురైన ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పది రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. ఈ ఘటన సురంగల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్ర కారం.. మున్సిపల్ పరిధిలోని సురంగల్‌కు చెందిన మేలక కొమరయ్య ఏకైక సంతానం మేకల మధు(21) పండ్ల వ్యాపారి. వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు చేశాడు. అప్పు విషయం తల్లిదండ్రులకు చెప్పకుండా మనోవేదనకు గురయ్యాడు. తీవ్ర మనస్థాపానికి గురైన యువకుడు పది రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. మూడు రోజుల వరకు విషయం ఎవరికీ చెప్పలేదు. మూడవ రోజు అతడు స్పృహకోల్పోయి నోటి నుంచి నురుగులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పది రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొంది శనివారం మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తులో ఉంది.

పల్లెల అభివృద్ధితోనే ప్రగతి


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: పల్లెల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మహాల్ ఎలికట్ట గ్రామంలో దేవశ్రీ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రజలందరూ ఆర్వో ప్లాంటును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బద్దుల మల్లయ్యయాదవ్, నారం పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్


ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల మాక్ డ్రిల్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు, అగ్ని ప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు చేపట్టబోయే సహాయక చర్యలపై జాతీయ విపత్తుల సహాయ బృందాల (ఎన్‌డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. భవనాలు కూలిపోయినప్పుడు, కొండచరియలు విరిగిపడినప్పుడు, వినాశకరమైన వరదలు సంభవించినప్పుడు, తుపానుల వంటి విపత్తుల సమయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ కాపాడుతుందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తమను తాము ఏ విధంగా రక్షించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, కలెక్టరేట్ ఏఓ సునీల్, సీసీ జనార్దన్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి గంప శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

ఇస్త్రీ దుకాణం దగ్ధం

షాద్‌నగర్: ప్రమాదవశాత్తు ఇస్త్రీ దుకాణం దగ్ధమైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి షాద్‌నగర్‌లోని టీచర్స్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన బాసుపల్లి లింగం కొంత కాలంగా టీచర్స్ కాలనీలో దుకాణం ఏర్పాటు చేసుకుని ఇస్త్రీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చే సరికి షాపులోని దుస్తులతో పాటు ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు. ప్రమాదంలో లక్ష రూపాయల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

త్రాసు.. తిరకాసు!

తూనికలు, కొలతల శాఖలో ఇష్టానుసారం

అవినీతి అధికారిణికి అందలం!!

- ఏసీబీకి చిక్కి సస్పెండైన తొమ్మిది నెలల్లోనే తిరిగి పోస్టింగ్
- జిల్లా స్థాయి కీలక పోస్టులో అదనపు బాధ్యతలు
- జూనియర్‌కు పోస్టింగ్ ఇవ్వడంపై అనుమానాలు

సాక్షి, సిటీబ్యూరో: తూనికలు, కొలత శాఖ తీరు మారడం లేదు. అడుగడుగునా అవినీతి, అక్రమాల అపవాదు మూటకట్టుకున్న ఈ శాఖలో పరిపాలన యంత్రాంగం తీరు అనుమానాలు, విమర్శలకు తావిస్తోంది. తాజాగా ఏసీబీకి చిక్కి సస్పెండైన ఒక అధికారిణి పోస్టింగ్‌ను కేవలం తొమ్మిది నెలల్లో పునరుద్ధరించడం, రెండు నెలల తర్వాత సీనియర్లను పక్కకు పెట్టి.. జూనియర్ అయిన సదరు అధికారిణికి జిల్లాస్థాయి కీలక పోస్టుకు అదనపు బాధ్యతలు అప్పగించడం విస్మయానికి గురిచేస్తోంది. ఇందులో అసలు ట్విస్ట్ ఏంటంటే ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన కార్యాలయంలోనే జిల్లా స్థాయి కీలక పోస్టుకు ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించడం తూనికలు, కొలతల శాఖలో చర్చనీయాంశంగా మారింది.


అసలేం జరిగిందంటే..?

ఏడాది క్రితం పద్మారావు నగర్‌లోని రంగారెడ్డి జిల్లా తూనికలు, కొలతల శాఖ కార్యాలయంలో డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు ముడుపులు తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. తూనికలు, కొలత శాఖ అధీకృత లైసెన్స్‌డ్ స్కిల్డ్ వర్కర్ (రిపేరర్) ఒకరు నాట్కో ఫార్మా లిమిటెడ్‌కు సంబంధించిన 25 ఎలక్ట్రానిక్ డిజిటల్ వేయింగ్ స్కేల్ మిషన్ల వ్యాలిడిటీ సర్టిఫికెట్ల పునరుద్ధరణ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని వాటికి సంబంధించి డిపార్ట్‌మెంట్ ఫీజు రూ.7,900 చెల్లించారు. పునరుద్ధరణ కోసం సదరు డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించగా డిపార్ట్‌మెంట్ ఫీజు కాకుండా అదనంగా ఒక్కో మిషన్‌కు రూ.400 చొప్పున 25 యంత్రాలకు రూ.10 వేలు ముట్టజెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సదరు అధీకృత లైసెన్స్‌దారు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించి సదరు అధికారిణి ఫోన్ సంభాషణ ఆడియో, వీడియో రికార్డు అందజేశారు. అనంతరం కార్యాలయంలో నగదు ముట్టజెప్పుతుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్, టెక్నిషియన్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా.. వీరిని రిమాండ్‌కు తరలించారు. దీంతో తూనికలు, కొలతల శాఖ ఇరువురిని సస్పెండ్ చేసింది.

పోస్టింగ్ పునరుద్ధరణ ఇలా...

ఏసీబీకి చిక్కి సస్పెండైన తొమ్మిది నెలల తర్వాత డిసెంబర్ 16న జీవోఆర్‌టీ నెంబర్ 54 ద్వారా సదరు డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌ను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో డిసెంబర్ 20న హెడ్ క్వార్టర్-1, హైదరాబాద్ సిటీలో డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ కేటాయిస్తూ తూనికలు, కొలతల శాఖ కంట్రోలర్ ఆదేశాలు జారీ చేశారు. ఇదీలా ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరి 28న రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ (ఏసీ) జగన్మోహన్ రెడ్డి పదవీ విరమణ చేశారు. నిబంధనల ప్రకారం ఆ స్థానంలో రెగ్యులర్ అధికారి నియామకమయ్యే వరకు ఇతర జిల్లాలో పని చేస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్‌కు గానీ అర్హులైన సీనియర్ డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్‌కు గానీ తాత్కాలికంగా అదనపు బాధ్యతలను అప్పగించాల్సి ఉంటుంది. అయితే.. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా.. ఏసీబీకి చిక్కి తాజాగా విధుల్లో చేరిన జూనియర్ అయిన డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్‌కు అసిస్టెంట్ కంట్రోలర్‌గా బాధ్యతలు అప్పగించడం విస్మయానికి గురి చేస్తోంది. ఏసీబీకి చిక్కిన ఆఫీస్‌లోనే ఉన్నత స్థాయి కీలక పోస్టులో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తుండటంతో తూనికలు, కొలతల శాఖ జిల్లా స్థాయి అధికారులు విస్మయానికి గురవుతున్నారు.

నా ప్రమేయమేమీ లేదు.. కంట్రోలరే పోస్టింగ్ ఇచ్చారు..



రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కంట్రోల్ (ఏసీ) పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఒక డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్‌కు బాధ్యతలు అప్పగించడంలో నా ప్రమేయమేమీ లేదు. రాష్ట్ర కంట్రోలరే ఆ పోస్టింగ్ ఇచ్చారు. తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించే పోస్టులకు సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలన్న నిబంధన ఏమీ లేదు. సదరు అధికారిణికి వర్క్ తక్కువగా ఉండటంతో అక్కడ అదనపు బాధ్యతలు అప్పగించాం. రెగ్యులర్ పోస్టు భర్తీ కోసం కంట్రోలర్ దృష్టికి తీసుకెళ్లాం.

– రాజేశ్వర్, అసిస్టెంట్ కంట్రోలర్ (అడ్మిన్) లీగల్ మెట్రాలజీ, హైదరాబాద్